# కానుమోలులో 2 ఏళ్ల నమ్మకం

## – అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



## ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వ రెండేళ్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే

కృష్ణా జిల్లా/గన్నవరం(వాయిస్ టుడే): బాపులపాడు మండలం కానుమోలు గ్రామంలో నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గత రెండేళ్లలో ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే గన్నవరం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. అనంతరం రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కానుమోలు గ్రామంలో ఇప్పటివరకు రూ.67 లక్షల విలువైన రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, అదనంగా రూ.2.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం జీవో–30 అమలు చేస్తోందని యార్లగడ్డ తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే కార్యక్రమం చేపట్టారని చెప్పారు. రిజిస్ట్రేషన్ ఖర్చులు, స్టాంప్ డ్యూటీని కూడా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. మంగళగిరిలో ఇప్పటికే వేలాది మందికి ఇళ్ల పట్టాలు అందజేసినట్లు గుర్తు చేశారు. గన్నవరం నియోజకవర్గంలో ఈ పథకం అమలులో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నామని తెలిపారు. గన్నవరం మండలంలో ఇప్పటికే 450 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, కొత్తపల్లి గ్రామంలో 196 పట్టాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఇటీవల ఆర్డీవో, తహసీల్దార్లతో సమావేశమై మరో 341 మందికి పొజెషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించినట్లు వెల్లడించారు. మరో 500 నుంచి 600 మంది అర్హులకు కూడా త్వరలో పట్టాలు అందించే కార్యక్రమం చేపడతామని చెప్పారు. బాపులపాడు మండలంలోని కళ్యాణ మండపంలో భారీ స్థాయిలో పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కానుమోలు గ్రామ ప్రజలు గత ఎన్నికల్లో తనకు మెజారిటీ ఇచ్చి అండగా నిలిచారని, అలాంటి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని యార్లగడ్డ పేర్కొన్నారు. 2019లో టీడీపీ వెనుకబడినా, 2024 ఎన్నికల్లో గ్రామ ప్రజలు విశ్వాసం ఉంచి మెజారిటీ అందించారని గుర్తు చేశారు. ప్రజలు చూపిన ప్రేమ, నమ్మకానికి అభివృద్ధి ద్వారానే ప్రతిఫలం ఇస్తానన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత ద్వేషాలకు, కక్షసాధింపులకు తావు లేదని, ప్రజల కోసం పనిచేయడమే తన లక్ష్యమని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనను, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు పోల్చి చూడాలని సూచించారు. తాము తప్పుడు కేసులు పెట్టడం, రాజకీయ వేధింపులకు పాల్పడడం లేదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా నిరసనలు తెలిపే హక్కు ఉందని, కానీ అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. వైసీపీ నేతల విమర్శలకు ఘాటుగా స్పందించిన ఎమ్మెల్యే, డీఎస్సీ అంశంపై ఆరోపణలు చేస్తున్న నేతలు ముందుగా ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. 16 వేలకుపైగా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించడం, డేటా సెంటర్లు ఏర్పాటు చేయడం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటి అంశాల్లో లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల్లో గణనీయమైన వాటా ఆంధ్రప్రదేశ్‌కు దక్కేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం పరిశ్రమలు రాష్ట్రం విడిచి వెళ్లకుండా కూడా కాపాడలేక పోయిందని విమర్శించారు. ప్రస్తుతం పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మాజీ మంత్రులు, వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ, రాష్ట్ర అభివృద్ధి, డీఎస్సీ, పెట్టుబడులు, ఉద్యోగాలు, గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి సహా ఏ అంశంపైనైనా బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ప్రజల ముందు వాస్తవాలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అసెంబ్లీకి హాజరుకాకుండా బయట విమర్శలు చేయడం కంటే, సభలో చర్చించడం మంచిదనీ సూచించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా ప్రజా సమస్యలపై మాట్లాడటం సమంజసం కాదని పేర్కొన్న యార్లగడ్డ, రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలంటే శాసనసభను వేదికగా ఉపయోగించాలన్నారు. ప్రజలిచ్చిన బాధ్యతను నిర్వర్తించకుండా జీతాలు తీసుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన అజెండా అని యార్లగడ్డ స్పష్టం చేశారు. ప్రతి ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న హుజూర్ నగర్ పోలీసులు

### – దాతల సహకారంతో ట్రై సైకిల్ అందజేసిన, ఎస్ఐ చలికంటి నరేష్

హుజూర్ నగర్, ఆగస్టు 08: (వాయిస్ టుడే ప్రతినిధి): ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు హుజూర్‌నగర్ పోలీసులు. పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీకి చెందిన ఇందిరాల పిచ్చయ్యకు దాతల సహకారంతో నూతన ట్రై సైకిల్‌ను అందజేసి భరోసా కల్పించారు. పిచ్చయ్య గత నెలలో తన నివాసం బయట ట్రై సైకిల్‌ను పార్కింగ్ చేయగా, గుర్తుతెలియని వ్యక్తి వాహనంతో ఢీకొట్టడంతో అది తీవ్రంగా దెబ్బతిని వినియోగానికి పనికిరాకుండా పోయింది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిచ్చయ్య పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న పోలీసులు స్పందించి, అతని దైనందిన అవసరాలకు ట్రై సైకిల్ ఎంతగానో అవసరమని గుర్తించారు. దాతల సహకారంతో నూతన ట్రై సైకిల్‌ను సమకూర్చి శనివారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా పిచ్చయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. దాతల సహకారంతో వికలాంగుడికి ట్రై సైకిల్ అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ టూ టౌన్ ఎస్ఐ హనుమాన్ నాయక్, ఏఎస్ఐ బలరాం రెడ్డి, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, జానీ మియా తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరులో పండుగ సాయన్న జన్మదిన వేడుకలు



మహబూబ్నగర్ జిల్లా ఆగస్ట్ 8 (వాయిస్ టుడే): నవాబు పేట్ దళిత బహుజన మహా వీరుడు, రాబిన్ హుడ్ పండుగ సాయన్న జయంతి సందర్భంగా కొల్లూరు గ్రామంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పలువురు వ్యక్తులు మాట్లాడుతూ 1840 1900 సంవత్సర మధ్యకాలంలో మహబూబ్ నగర్ జిల్లా, నవాబుపేట మండలం కొల్లూరు ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని మెరుగోనిపల్లి గ్రామంలో జన్మించిన మహావీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల జీవనోపాధి కోసం పిత్తందారులను దోచి బీద వర్గాలకు సాయం చేసిన శ్రమజీవి పండుగ సాయన్న అని కొనియాడారు. బీద కుటుంబాలలో ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం జరిగిందని వారు అన్నారు. అలాంటి మహానుభావుడు జన్మించిన మన గ్రామంలో వారి విగ్రహాన్ని మనము నెలకొల్పడం ఎంతో సంతోషంగా ఉందని వారు అన్నారు. విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ సర్పంచ్ విస్లావత్ సేవ్య నాయక్ ఆధ్వర్యంలో జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విస్లావత్ సేవ్య నాయక్, ఉప సర్పంచ్ సునీత జగన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తులసి రామ్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ విస్లావత్ చందర్ నాయక్, నాయకులు లక్ష్మీ నరసింహ రాజు, మహమ్మద్ ఖాజామైనోద్దీన్, వాసు యాదవ్, ముదిరాజ్ సంఘం నాయకులు పసుల గోపాల్, బంటు శ్రీనివాస్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ సంస్కృతికి 'ప్రగతి' బోనాల జాతర వేదిక




రాయికల్(వాయిస్ టుడే): తెలంగాణ పల్లె సంస్కృతి పరిమళించింది.. జానపద కళారూపాలు కనువిందు చేశాయి.. బోనాల సందడితో రాయికల్ పురవీధులు మార్మోగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తిభావాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 'ప్రగతి బోనాల జాతర'ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సంప్రదాయ వేషధారణలు, జోగిని--పోతురాజుల విన్యాసాలు, నృత్యాలు, కోలాటాలు, నవదుర్గల వేషధారణలతో సాగిన శోభాయాత్ర పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ప్రగతి ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన శోభాయాత్ర శివాజీ బొమ్మ, పాత బస్టాండ్, మార్కెట్ వీధుల మీదుగా పోచమ్మ దేవాలయం వరకు కొనసాగింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో పాల్గొనగా.. జోగిని, పోతురాజుల విన్యాసాలు, కోలాటం, యోగ్‌చాప్, నవదుర్గల వేషధారణలు శోభాయాత్రకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి.

శోభాయాత్రలో ప్రత్యేకంగా రూపొందించిన బోనాల శకటం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తిభావాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల నృత్యాలు, జానపద కళారూపాల ప్రదర్శనలతో పురవీధుల్లో పండుగ వాతావరణం నెలకొంది. శోభాయాత్ర పోచమ్మ దేవాలయానికి చేరుకున్న అనంతరం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. విద్యార్థులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం పుస్తక విజ్ఞానం అందించడం మాత్రమే కాకుండా, మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, జానపద కళారూపాల గొప్పతనాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మన పండుగలు మన సంస్కృతికి ప్రతిరూపాలని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకుని, భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతోనే 'ప్రగతి బోనాల జాతర' నిర్వహించినట్లు తెలిపారు. బోనాల జాతర సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీశాయి. జోగిని, పోతురాజుల విన్యాసాలు, నవదుర్గల వేషధారణ, కోలాటం, నృత్యాలు, యోగ్‌చాప్ ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్రగతి బోనాల జాతర విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్ , కరస్పాండెంట్ జయశ్రీ, ఉపాధ్యాయ బృందము, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పరామర్శ

రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ పట్టణ సీనియర్ పాత్రికేయులు చింతకుంట సాయికుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు ఎడమచేతికి విరుగగా శాస్త్ర చికిత్స జరిగింది. బిజెపి నియోజకవర్గ బాధ్యురాలు బోగ శ్రావణీ ఆయనను స్వగృహంలో కలిసిన పరామర్శించారు. ఆమె వెంటా నాయకులు రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు అన్నవేని వేణు, కౌన్సిలర్లు పుర్రె శ్రీధర్, కునారపు భూమేష్, వేముల రాము, శ్రీకాంత్ రెడ్డి, సింగని సతీష్, రాజేశం, నర్సయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుని కలిసిన నిర్మల్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 08: ఇటీవల నూతనంగా ఎన్నికైన నిర్మల్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గా నర్సాపూర్. జి మండలం నర్సాపూర్. జి గ్రామ సర్పంచ్ గడ్డం ఇంద్ర కరణ్ రెడ్డి ఎన్నికయ్యారు. కావున ఈరోజు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ( డి సి సి )అధ్యక్షులు ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ. వెడ్మ బొజ్జు పటేల్ ని అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ క్యాంప్ ఆఫీస్ లో గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి వెడ్మ బొజ్జు పటేల్ గారికి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ గడ్డం ఇంద్ర కరణ్ రెడ్డి కి సన్మానం చేశారు నిర్మల్ జిల్లాలో ఉన్న 400 గ్రామపంచాయతీలకు కలిపి ఆగస్టు 7 శుక్రవారం రోజున నిర్మల్ పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్మల్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులుగా గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి ని నిర్మల్ జిల్లా సర్పంచులు అందరూ కలిసి ఎన్నుకున్నారు. నాకు నిర్మల్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులుగా ఎన్నికైనందున నాతో పాటు సర్పంచులందరికీ కృషి చేస్తానని అని అన్నారు. ఈ కార్యక్రమం లో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డి సి సి సెక్రటరీ ఉమామహేశ్వర్ మరియు ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు



## పర్యావరణ ఉద్యమకారుని కోల్పోయాం

రాయికల్(వాయిస్ టుడే,): రాయికల్ మండలం వస్తా పూర్ నివాసి బత్తుల మల్లన్న ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను . మాజీ మంత్రి భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పరామర్శించారు. ఇట్టి సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం స్ఫూర్తితో అటవీ ప్రాంత పరిరక్షణకు అంకితమైన వ్యక్తి బత్తుల మల్లన్న తెలంగాణ ఉద్యమకారుడు మల్లన్న మాజీ ముఖ్యమంత్రి ప్రారంభించిన హరితహారం కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని, పర్యావరణ పరిరక్షణతో పాటు అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు హాయ్ ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేతను అరికట్టడంతో పాటు, కొత్త మొక్కలను నాటడం, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం, ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు స్థానికులను భాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలను చాలా చేశారు అలాంటి మల్లన్న మరణం చాలా బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రవి నాయకులు గోపి రాజిరెడ్డి, బర్కం మల్లేష్, మహిపాల్ శ్రీధర్ రెడ్డి, హరీష్ రావు, సుధీర్, రవి, బొమ్మెన తిరుపతి, రొండి గంగారాం, దుంపేట బుచ్చన్న , ముజహీద్, కొత్తూరి రాకేష్ , అంజాద్, మహేష్, రవి, నందు నాయక్ బుజ్జిఅక్క తదితర నాయకులు పాల్గొన్నారు



## ప్రభుత్వ పాఠశాలలో బోనాల పండుగ

రాయికల్(వాయిస్ టుడే): రామాజిపేట ఉన్నత పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ మండలంలోని రామాజీపేట ఉన్నత పాఠశాలలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతీకగా నిలిచే బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించారు విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు విద్యార్థులు తెలంగాణ జానపద పాటలు నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు పాఠశాల ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది విద్యార్థులు బోనాల పండుగ యొక్క చారిత్రక సంస్కృతిక ప్రాధాన్యతను తెలియజేస్తూ మన సంప్రదాయాలను కాపాడుకోవాల్సిందిగ బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఉపాధ్యాయులు తెలిపారు ఈ కార్యక్రమంలో అదనపు బాధ్యత ప్రధానోపాధ్యాయులు రమేష్ ఏఎంసీ చైర్మన్ ఇద్దం లక్ష్మి గ్రామ సర్పంచి బెజ్జంకి మోహన్ ఉపసర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విజయ్ కిరణ్ రమ జ్యోతి యశోద వర్మ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.